నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

పల్లె ప్రజలు జూడ పరుల పట్ల నెపుడు
పలకరింత్రు ప్రేమ వరుస కలిపి
నగర జనులు జూడ నవసరమ్ము కొరకె
మాటలాడునంట మాయజేయ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు, కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 114 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 23-7-2025 పేజిలు -8 | వెల: రూ. 5.00




## ధన్‌ఖర్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

- జగ్‌దీప్ ఆయురారోగ్యాలతో ఉండాలని మోదీ ఆకాంక్ష

న్యూఢిల్లీ,-జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్) ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా సమర్పించగా.. మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దానికి ఆమోదం తెలిపారు. ఈ సమాచారాన్ని రాష్ట్రపతి కార్యాలయం హోంమంత్రిత్వ శాఖకు తెలియజేసింది. అలాగే దీనికి సంబంధించి త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. అనారోగ్య కారణాలతో ధన్‌ఖడ్ రాజీనామా చేస్తున్నాట్లుగా ప్రకటించారు. అయితే ఆయన రాజీనామాపై ఎలాంటి అనుమానాలు ప్రభుత్వం

-మిగతా 2 లో

## ఉచితబస్సు ప్రయాణంలో

# రికార్డు

### 200 కోట్ల మందికి ఉచిత ప్రయాణం

- ఆర్టీసీ డిపోల్లో నేడు సంబురాలు
- ఇప్పటి వరకు 200 కోట్ల మంది ఉచిత ప్రయాణం
- వాటి విలువ 6700 కోట్లు
- ప్రతి మహిళకు ఉచిత ప్రయాణంతో నెలకు నాలుగైదు వేలు ఆదా
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, -జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)
మహాలక్ష్మి పథకం మరో మైలు రాయి దాటిందని, ఈ పథకం ద్వారా రెండు వందల కోట్లు మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, దీన్ని పురస్కరించుకుని బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 97 ఆర్టీసీ డిపోలు, 341 బస్ స్టేషన్‌ల్లో సంబురాలు నిర్వహించనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజాపాలనలో అమలు చేసిన మొట్టమొదటి పథకం మహా లక్ష్మి పథకం అని, ఈ పథకం 9 డిసెంబర్ 2023 నుండి విజయవంతంగా అమలవుతుందన్నారు. ఆర్టీసీలో ఇప్పటి వరకు 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, వీటి విలువ రూ. 6700 కోట్లు -మిగతా 2 లో

### మరో మైలు రాయిదాటిన మహాలక్ష్మి పథకం..




## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పై


# వెనకడుగు లేదు

### ఎలాటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం



- అవసరమైతే న్యాయ పోరాటానికి కూడా వెనకాడం
- కేంద్రం దీనిని వెంటనే ఆమోదించి చిత్తశుద్ధి చాటాలి
- రామచంద్రరావు లీగల్ నోటీసులకు జడిసేది లేదు
- మీడియాతో డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,-జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై న్యాయపరమైన సమస్యలు వస్తే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలంగాణ డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. కులగణన సర్వే ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. సచివాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. బిసి రిజర్వేషన్లలో వెనక్కి పోయే ప్రసక్తి లేదని అన్నారు. కులగణన అవసరం లేదని భాజపా మొదట మాట్లాడింది. తెలంగాణ -మిగతా 2 లో



## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 'సుప్రీం' నోటీసులు..!

- ఆ విషయంలో స్పష్టత ఇవ్వాలని సూచన..!

న్యూఢిల్లీ,-జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)
రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా తమ నిర్ణయం చెప్పాలని కోర్టులు ఆదేశించవచ్చా? అన్న అంశంపై సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ మేరకు అభిప్రాయం తెలియజేయాలంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ జరిపింది. వారంలోగా ఈ విషయంలో స్పందన చెప్పాలని ఆదేశించింది.ఈ అంశం రాష్ట్రానికి మాత్రమే కాదని.. దేశానికి సంబంధించిన విషయాన్ని గమనించాలని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. -మిగతా 2 లో



## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- చేసిన పనులపై ఎప్పటికప్పుడు వివరించాలి
- పెద్ద ఎత్తున కార్యక్రమాలపై వివరించేలా ప్రచారం
- సమాచారశాఖ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష

హైదరాబాద్ -జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఏడాదిన్నర కాలంలో ఎన్నోసంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తూ ముందుకు సాగుతున్నదని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అయితే ఎన్ని మంచి పనులు చేసినప్పటికీ చేసిన మంచి పనులను సవివరంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నామని అభిప్రాయపడ్డారు. నేడు ప్రతిపక్షంలో ఉన్న పార్టీ పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో -మిగతా 2 లో




## డ్రగ్ మాఫియాకు కేంద్రంగా మారిన

# కరీంనగర్

- వెలుగులోకి వస్తున్న నకిలీ మందుల మాఫియా బాగోతం
- అలేటి నవీన్, సబ్ ఎడిటర్ నీలగిరి ఎక్స్‌ప్రెస్


కరీంనగర్, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)
కరీంనగర్ జిల్లాలో నకిలీ మెడిసిన్ల దందా జాడలు చెదిరిపోతున్నాయి. కమిషన్ల ఆధారంగానే నడుస్తున్న ఈ బంధపు చిట్టిలో మెడికల్ ఆఫీసర్ల పాత్ర కీలకంగా మారిందని నీలగిరి ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక విచారణలో స్పష్టమవుతోంది. మెడికల్ డ్రగ్ వ్యవస్థ పూర్తిగా వాణిజ్య కేంద్రీకృతమై, జన ఆరోగ్యం పైనే ఓ రకమైన ఆటలాడుతున్న పరిస్థితి వెలుగు చూసింది. కరీంనగర్ జిల్లాలోని అనేక మెడికల్ ఏజెన్సీలు, జెనరిక్ మెడిసిన్ పేరిట తక్కువ నాణ్యత గల మందులను సరఫరా చేస్తున్న వైనం గమనార్హం. డాక్టర్లు సూచించిన మెడిసిన్‌తో -మిగతా 2 లో









## బీజేపీది బీసీ వ్యతిరేక వైఖరి

- అందుకే రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోంది
- బీసిల కోసం అవసరమైతే ఎంపిలు రాజీనామా చేయాలి
- మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,-జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం అసాధ్యం అనడం బీజేపీ అసలు స్వరూపాన్ని బయటపెడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. బిజెపి మాట్లాడుతున్న తీరు దాని బిసి వత్యిరేకతను బయటపెట్టిందన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గతంలో పక్క రాష్ట్రం తమిళనాడులో ఇదే విధమైన రిజర్వేషన్లు అమలు -మిగతా 2 లో

## ధన్‌ఖర్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

(మొదటి తరువాయి)

పక్షాన వ్యక్తం కాలేదు. సరికదా ఆయన ఆయురారోగ్యా లతో ఉండాలని కోరుకుంటున్నానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఉప రాష్ట్రపతి పదవితో సహా వివిధ హోదాల్లో ధన్‌ఖడ్ దేశానికి సేవలు అందించారని అన్నారు. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో పార్లమెంటు– వర్షాకాల సమావేశాల తొలిరోజున కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ధన్‌ఖడ్.. రాత్రి కల్లా అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలుగుతున్నట్లు– అందులో పేర్కొన్నారు. వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ)కు అనుగుణంగా నేను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నా. బాధ్యతల నిర్వహణలో నాకు అండగా నిలిచిన రాష్ట్రపతికి కృతజ్ఞతలు. పదవీకాలంలో మేం చాలా ప్రశాంతమైన, అద్భుతమైన వర్కింగ్ రిలేషన్‌ను కొనసాగించాం. ప్రధాన మంత్రి, మంత్రి మండలికీ హృదయపూర్వక కృతజ్ఞతలు అని ధన్యవాదాలు చెప్పారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ల 344 రోజులకే ఆయన వైదొలగాలని నిర్ణయించుకున్నారు. దేశ 14వ ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన సోమవారం సాయంత్రం వరకూ ఆరోగ్యంగా కనిపించినప్పటికీ రాత్రికి అదే కారణంతో రాజీనామా చేయడం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. ధన్‌ఖడ్ రాజీనామా ఊహించని పరిణామమని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఆరోగ్య అంశం కంటికి కనిపిస్తున్నా కనిపించనివి ఏవో దీనివెనక ఉండి ఉంటాయని అనుమానం వ్యక్తంచేసింది.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 'సుప్రీం' నోటీసులు..!

(మొదటి తరువాయి)

శాసనసభ ఆమోదించిన పది బిల్లులను ఆమోదించడంలో గవర్నర్ తీవ్ర జాప్యం చేస్తున్నారంటూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆశ్రయించింది. ఈ విషయంలో విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పును వెలువరించింది. నిర్దిష్ట గడువులోగా బిల్లులపై నిర్ణయం చెప్పాలని.. మూడు నెలల్లోగా ఆమోదించడమే.. తిరస్కరించడమో చేయాలని సూచించింది. ఈ తీర్పు తర్వాత సైతం ఇలాగే చేస్తూ మళ్లీ తమను ఆశ్రయించవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది.రాజ్యాంగ అధికరణం 142 ప్రకారం.. న్యాయ సమీక్ష చేసేందుకు సంపూర్ణ అధికారం సుప్రీం కోర్టుకు ఉందని జస్టిస్ జేబీ పార్దివాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, సుప్రీం కాలపరిమితి విధించడంపై రాష్ట్రపతి తీవ్రంగా స్పందించారు. అయితే, రాష్ట్రాలు అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులపై నిర్ణయం తీసుకునే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు కాలపరిమితి ఎలా విధిస్తారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టును ప్రశ్నించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 (1) కింద 14 ప్రశ్నలను సంధిస్తూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టును 14 ప్రశ్నలు సంధించారు. తాజాగా అంశంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్రాల అభిప్రాయాలను కోరింది.

## బీజేపీది బీసీ వ్యతిరేక వైఖరి

(మొదటి తరువాయి)

అయ్యాయి. సుప్రీంకోర్టు ఇందిరా సహనీ కేసులో స్పష్టంగా చెప్పింది రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ప్రమాణితమైన సమాచారం, ఎంపెరికల్ డేటా ఉంటే వారు రిజర్వేషన్ నిర్ణయం తీసుకోవచ్చని అన్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రభుత్వం సర్వే చేసింది, కేబినెట్ ఆమోదం తీసుకుంది, శాసనసభ ఆమోదం పొందింది. గవర్నర్ ఆమోదంతో అది ఇప్పుడు ఢిల్లీలో ఉంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సిన బాధ్యత ఉందని ఆయన అన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు రిజర్వేషన్ల కోసం రాజీనామా చేయాలి. నిజంగా బీసీల పక్షాన నిలబడాలని ఉంటే, రిజర్వేషన్లు అమలయ్యేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి చూపాలి. లేకపోతే బీసీల పట్ల కుట్ర చేస్తూ ఉంటారని భావించాలని మంత్రి ఘాటుగా వ్యాఖ్యానించారు. అనాడు మండల కమిషన్‌ను వ్యతిరేకించింది బీజేపీయే. ఇప్పుడు మళ్లీ బీసీల రిజర్వేషన్లపై వక్రబుద్ధిని చూపిస్తోంది. తెలంగాణలోని అన్ని బీసీ సంఘాలు ఈ కుట్రను గమనించి రిజర్వేషన్ హక్కులను కాపాడేందుకు ముందుకు రావాలని పొన్నం పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది. మా ముఖ్యమంత్రి

రేవంత్‌రెడ్డి బీసీల పక్షాన నిలుస్తున్నారు. మా పీసీసీ అధ్యక్షుడు కూడా బీసీ వర్గానికే చెందినవారు. మా వర్గాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం అని హెచ్చరించారు. అదే సమయంలో, బీజేపీపై విరుచుకుపడుతూ, మీరు ముఖ్యమంత్రి బీసీ అని, సిఎల్పీ నాయకుడు బీసీ అని మభ్యపెడతారు. కానీ పార్టీ అధ్యక్ష పదవిని బీసీ వర్గానికి ఇవ్వని మీరు, మళ్లీ బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారు. ఇది మీ అసలు స్వరూపం అని మంత్రి ఆరోపించారు.

# ఉచిత బస్సు ప్రయాణంలో రికార్డు

(మొదటి తరువాయి)

అనిపేర్కొన్నారు. ఇందుకు సంబంధించి రీయింబర్స్‌మెంట్ కూడా ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లిస్తోందన్నారు.

**పథకం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు**

ఆర్టీసీలో ఎలాంటి ఆటంకాలు లేకుండా కొత్త బస్సులను కొనుగోలు చేస్తూ మహాలక్ష్మి పథకం విజయవంతం కోసం కృషి చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు , కండక్టర్ లు, శ్రామిక్ లు, ఇతర సిబ్బంది అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల భద్రత , ఉద్యోగుల సంక్షేమం ప్రథమ కర్తవ్యంగా ముందుకు పోతున్నామని పేర్కొన్నారు. ఉచిత ప్రయాణం ద్వారా మహిళా సాధికారత దిశగా అడుగులు పడుతున్నాయని, దూరపు ప్రాంత ప్రజలు కూడా నిత్యం నగరానికి వచ్చి ఉద్యోగాలు చేస్తూ ఆర్టీసీ వృద్ధి సాధించడం అభినందనీయమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రతి మహిళా నెలకు 4-5 వేల రూపాయల వరకు ఉచిత ప్రయాణం ద్వారా ఆదా చేసుకుంటున్నారు.

**సంబురాలు ఘనంగా నిర్వహించాలి**

రాష్ట్ర వ్యాప్తంగా 97 బస్సు డిపోలు, 341 బస్ స్టేషన్ లలో సంబురాలు ఘనంగా నిర్వహించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం అన్నారు. బస్ స్టేషన్లు, డిపోలు మొదలైన వాటిలో బ్యానర్లు ప్రదర్శించాలని సూచించారు. ఈ సంబరాల కార్యక్రమాల్లో ఎంపీలు/మంత్రులు/ఎమ్మెల్యేలు/మేయర్లు/వీఐపీలను ఆహ్వానించాలన్నారు. కార్యక్రమంలో మహిళా ప్రయాణీకులు, కూరగాయల విక్రేతలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వ్యాపార మహిళలు, యాత్రికులను భాగస్వామ్యం చేసి ఉత్తమంగా ప్రసగించేవారికి బహుమతితో సత్కరించాలన్నారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకం, మహిళా సాధికారత మొదలైన అంశాలపై విద్యార్థులకు వ్యాస రచన, రంగోలి, చిత్రలేఖనం నిర్వహించి బహుమతులను అందజేయాలన్నారు .ఈ పథకం విజయవంతానికి దోహదపడిన ప్రతి డిపోలోని ఐదుగురు ఉత్తమ డ్రైవర్లు , ఐదుగురు ఉత్తమ కండక్టర్లతో పాటు ట్రాఫిక్ గైడ్‌లు, భద్రతా సిబ్బందిని సత్కరించాలన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పై వెనకడుగు లేదు

(మొదటి తరువాయి)

ప్రభుత్వం, రాహుల్ గాంధీ ఒత్తిడితో జనగణనలో కులగణన చేరుస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ బిల్లుకు పార్లమెంట్‌లో అన్ని పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తాం. కులగణనను క్యాబినెట్‌లో, శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించాం. అసెంబ్లీలో మద్దతు తెలిపిన పార్టీలు పార్లమెంట్‌లోనూ మద్దతు తెలపాలి. ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం పొందగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ముందుకెళ్తాం అని అన్నారు. రాష్ట్రంలో నిర్వహించిన కులగణన ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేయగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ముందకెళ్తామని స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో కొన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని, అసెంబ్లీలో మద్దతు తెలిపిన పార్టీలు పార్లమెంట్లో కూడా పోరాటం చేయాలని కోరారు. ఈ బిల్లు త్వరగా ఆమోదం పొందే ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుల గణన చేపడతామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని.. ఆయన చెప్పిన మాట ప్రకారమే రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కుల గణన నిర్వహించామని గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో కులగణన అంశం తెరపైకి రావడంలో తెలంగాణ రాష్ట్రానిది కీలక పాత్ర అని పేర్కొన్నారు. తెలంగాణలో కులగణన చేసిన తర్వాతే దీనిపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైందన్నారు. కులగణన సర్వేను చాలా పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించామని అందుకే తెలంగాణను చూసి కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేస్తామని ప్రకటించిందన్నారు. తెలంగాణ జరిగిన విధానమే రేపు దేశవ్యాప్తంగా అమలు కానుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణన, జనగణన చేయడానికి ఇంకా చాలా సమయం ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఏవైనా న్యాయపరమైన సమస్యలు వస్తే ఎదుర్కోవడానికి కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణన సర్వే దేశానికి మార్గదర్శకంగా నిలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు.భారత రాష్ట్ర సమితి ప్రజలను మభ్యపెట్టింది. అందరూ అలాగే చేస్తారని ఆ పార్టీ నేతలు అనుకుంటున్నారేమో. కులగణన సర్వేను చాలా పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాం. అందుకే తెలంగాణను చూసి కేంద్రం కూడా కులగణనను ప్రకటించిందని భట్టి అన్నారు. రాష్ట్ర భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావుకు బీసీలంటే చిన్నచూపు ఉన్నట్లుంది. ఆయన పంపిన లీగల్ నోటీసులకు ఎలా సమాధానం చెప్పాలో నాకు తెలుసు. నోటీ–సులకు భయపడేది లేదని కౌంటర్ ఇచ్చారు. నోటీసులు అందిన తరువాత ఏవిధంగా సమాధానం చెప్పాలో తనకు తెలుసన్నారు. రామచందర్ రావుకి దళితులన్నా బడుగు బహీన వర్గాలన్నా చిన్న చూపని విమర్శించారు. రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకోవడానికి రామచందర్ రావు కూడా కారణమంటూ ఇటీవల భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రివార్డుగా బీజేపీ అధిష్టానం ఆయనకు తెలంగాణ చీఫ్ పదవి ఇచ్చిందని ఆరోపించారు. రామచందర్ రావుకు తెలంగాణ చీఫ్ పదవి ఇవ్వడంపై బీజేపీ అధిష్టానం ఒకసారి పునరాలోచించాలని భట్టి అన్నారు. భట్టి వ్యాఖ్యలను తప్పుబట్టిన రామచందర్ రావు తన న్యాయవాదితో లీగల్ నోటీ–సులు పంపించారు. మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని.. లేకపోతే రూ.25 కోట్ల పరువు నష్టం దావా వేస్తానని రామచందర్ రావు నోటీ–సుల్లో హెచ్చరించారు. దీనిపై క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని సూచించారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

(మొదటి తరువాయి)

చెయ్యనివాటిని చేసినట్లుగా గోబెల్స్ ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టిందని, ప్రతిపక్షంలో కూడా అదే ఒరవడిని కొనసాగిస్తూ ప్రజల కళ్లకు గంతలు కడుతోందని విమర్శించారు. తమ ప్రభుత్వం చేసినదాన్ని కూడా పూర్తిగా చెప్పుకోలేకపోతున్నామని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఐ అండ్ పిఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి జి. మల్సూర్‌తో కలిసి మంగళవారం జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రి ఆలోచనలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం ఏడాదిన్నరలో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు ఎంతోచేసినప్పటికీ ఆశించిన రీతిలో ప్రజలకు వివరించలేకపోతున్నామని అన్నారు. ఇచ్చిన హామీలనే గాక ఇతర అంశాలలో ప్రజోపయోగపనులు చేపట్టామని , 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి దేశంలోనే ఇంత భారీ నియామకాలు చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణను అగ్రపథంలో నిలిపామన్నారు. ఇవేగాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదలకు సన్నబియ్యం, మహిళలకు రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రైతుభరోసా పెంపు, రుణమాఫీ, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, డైట్ ఛార్జీలు 40 శాతం పెంపు,ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల పంపిణీ ఇలా రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ఎంతో చేశామన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలలో చేయలేనిది ఏడాదిన్నరలో చేసి చూపించాం. పది సంవత్సరాలలో పేదలకు రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు ఆలోచన కూడా చేయలేదు. ఉన్న రేషన్ కార్డులలో పేర్లు కూడా నమోదు చేయలేదు. గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డుల్లో పేరునమోదు కోసం ఎదురు చూస్తున్న 15 లక్షల మంది పేదల పేర్లను రేషన్ కార్డులలో నమోదు చేశాం. కొత్తగా 7 లక్షల రేషన్ కార్డులిచ్చాం. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చాం. ఆర్థికంగా ఎంతో ఇబ్బంది ఉన్నాకూడా పేదల సంక్షేమం విషయంలో ఈ ప్రభుత్వం రాజీ పడడం లేదన్నారు. ఈ ప్రభుత్వం తీసుకున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత జిల్లాస్థాయిలో పౌరసంబంధాల శాఖ అధికారులదేనని ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ డైరెక్టర్ జగన్ డిప్యూటీ డైరెక్టర్ మధు పాల్గొన్నారు.

# డ్రగ్ మాఫియాకు కేంద్రంగా మారిన కరీంనగర్

(మొదటి తరువాయి)

పోలిస్తే వేరే కంపెనీల మందులు విక్రయిస్తున్న ఏజెన్సీలు వినియోగదారుల్ని మోసం చేస్తున్నాయన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. జెనరిక్ మెడిసిన్ అంటే తక్కువ ధర, అదే సమయంలో సమాన ప్రభావం కలిగించే మందులే అయినా కరీంనగర్ మార్కెట్‌లో మాత్రం నాణ్యతహీనత స్పష్టంగా కనిపిస్తోంది.వాస్తవానికి, మెడికల్ ఏజెన్సీలు ఏ మందునైనా నిల్వ పెట్టుకునే ముందు సంబంధిత కంపెనీ లైసెన్స్, డ్రగ్ అనుమతి ఉన్నదేనా అన్నదానిపై పూర్తి స్థాయిలో ధృవీకరణ ఉండాలి. కానీ ఇక్కడ మాత్రం నియమాలు అన్నీ ఒకెత్త లాభాలు ఒకెత్తగా మారిన వైనం స్పష్టమవుతోంది. అనుమతులు లేని కంపెనీల ముడి మందులు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి స్థానికంగా విక్రయిస్తున్న అనేక ఉదాహరణలు నీలగిరి ఎక్స్‌ప్రెస్ దృష్టికి వచ్చాయి.ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ఈ మాయాజాలాన్ని అడ్డుకునే బాధ్యత అధికారులు తీసుకోవాల్సినదే. కానీ డ్రగ్ ఇన్స్పెక్టర్లు మాత్రం తమ విధులు నిర్వర్తిస్తున్నామన్న మాటలకే పరిమితమవుతున్నారు. ఇప్పటివరకు కరీంనగర్‌లో నమోదైన మొదటి కేసే తెలంగాణ రాష్ట్రంలో తొలి కేసుగా నమోదవ్వడం కళ్లెదుట జరుగుతున్న గాఢతను బోధిస్తుంది. మిగిలిన అక్రమాలపై స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.నీలగిరి ఎక్స్‌ప్రెస్ ప్రతినిధి ఇటీవల కరీంనగర్ డ్రగ్ ఇన్స్పెక్టర్ల కార్యాలయాన్ని సందర్శించినప్పుడు, వారు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంలో ఆసక్తి చూపలేదు. "మేము లేం పై అధికారులు ఒత్తిడి చేస్తున్నారు"





అంటూ తప్పించుకునే ప్రయత్నం చేయడం, విషయాలను గోప్యంగా ఉంచడమే కాకుండా దీనిపై పూర్తిగా స్పష్టత ఇవ్వకుండా మీడియాను ఏడుగా చూస్తున్న తీరు, అధికార యంత్రాంగం ఎంత మేర బలహీనమైందో తెలియజేస్తోంది.ఇప్పటికే వందలాది మెడికల్ ఏజెన్సీలు నకిలీ మెడిసిన్లతో ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టుతున్నాయి. కొన్ని మందులు రోగానికి పనిచేయకుండా ఇతర రోగాల చికిత్సకు ఇవ్వబడుతున్న ఘటనలు కలవరపెడుతున్నాయి. వాస్తవానికి, డాక్టర్ల సూచనల ప్రకారమే సరైన మెడిసిన్ అందించాలి. కానీ ఇక్కడ మాత్రం జనరిక్ పేరుతో నకిలీ వాడకానికి ఊతమిచ్చే వ్యవస్థ బలపడుతోంది.దీంతో రోగులు తీవ్రంగా నష్టపోతున్నారు. మందులపై విశ్వాసం కోల్పోతున్నారు. ఆరోగ్య రంగాన్ని వ్యాపారదారుల చేతుల్లో వదిలేయడం వల్ల ప్రజలకు తీవ్ర అనర్థాలు వాటిల్లే ప్రమాదం పెరిగిపోతోంది. ఈ దుస్థితిని అధిగమించాలంటే, పై స్థాయి అధికారులు రంగంలోకి దిగాలి. జిల్లా స్థాయిలోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై సమగ్ర విచారణ జరిపి, తక్షణ చర్యలు తీసుకోవాలి. ఎక్కడేం జరుగుతోందో ఓసారి ప్రజాపరంగా వెల్లడించి, బాధ్యులను శిక్షించాల్సిన అవసరం ఉంది.ఈ విషయంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. తక్కువ ధరకు నకిలీ మెడిసిన్ కొనడం కాదు, నాణ్యత ఉన్న మందులే వినియోగించాలని అవగాహన కల్పించాల్సిన సమయం వచ్చింది. ఏజెన్సీల అక్రమాలపై సమాచారం ఉన్న ప్రతీసారి సంబంధిత శాఖకు తెలపాలి. ఆరోగ్యమే మహాభాగ్యం అని చెప్పే సమాజంలో%ూ% ఆరోగ్యాన్ని వ్యాపారం చేసే చేతుల్లో వదిలితే మిగిలేది అస్వస్థతే.

## 2025 జూలై 23, బుధవారం తెలుగు పంచాంగం




మాసం -పక్షం
మాసం: ఆషాఢమాసం (అమాంత)
పక్షం: కృష్ణపక్షం
తిథి
త్రయోదశి: జూలై 22 సాయంత్రం 8:05 నుంచి జూలై 23 సాయంత్రం 6:04 వరకు
చతుర్దశి: జూలై 23 సాయంత్రం 6:04 నుంచి జూలై 24 సాయంత్రం 4:24 వరకు
నక్షత్రం
ఆర్ద్ర: జూలై 22 రాత్రి 8:10 నుంచి జూలై 23 రాత్రి 7:05 వరకు
పూర్వఫాల్గుణి: జూలై 23 రాత్రి 7:05 నుంచి జూలై 24 రాత్రి 5:55 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:21 - 5:07
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:59 - 12:51
అమృతకాలం: మధ్యాహ్నం 1:12 - 2:49
అశుభ సమయాలు
రాహుకాలం: ఉదయం 7:27 - 9:04
యమగండం: మధ్యాహ్నం 11:54 - 1:30
గులిక కాలం: సాయంత్రం 3:27 -5:04
దుర్ముహూర్తం: ఉదయం 11:05 - 11:58, సాయంత్రం 5:59 - 6:50
వర్జ్యం: ఉదయం 8:12 -9:59

# కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన కమిషనర్

- విధులపై పూర్తి అవగాహనతో పనిచేయాలి-గౌష్ ఆలం



**కరీంనగర్, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ మంగళవారం తనిఖీ చేశారు. సిబ్బంది పరేడ్, స్టేషన్ పరిసరాలు, స్వాధీనం చేసుకున్న వాహనాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. తెలంగాణ పోలీసులు వినియోగించే సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఈ-సమన్ల జారీ, టీఎస్-కాప్, హెచ్‌ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్‌లో ఆర్థిక, ఆర్థికేతర నేరాలు, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, బాడీ వార్న్ కెమెరాలు వంటి అన్ని రకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, వాటిని రోజువారీ విధుల్లో విరివిగా వినియోగించాలని ఆదేశించారు. నూతన కానిస్టేబుళ్లకు విధులపై శిక్షణ అవసరమని, రౌడీ షీటర్లపై నిఘా కొనసాగించాలని ఆదేశించారు. స్టేషన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటస్వామి, ఎస్సైలు భాస్కర్ రెడ్డి, రాజన్న, సుమన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పీర్జాదిగూడలో ఘనంగా బోనాల ఉత్సవం

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి



**పీర్జాదిగూడ, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆషాడ మాసం పురస్కరించుకొని మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్‌లోని పలు అమ్మవార్ల ఆలయాల్లో బోనాల పండుగ ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక ఆలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ జక్కా వెంకట రెడ్డి ఆలయాలను సందర్శించి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని వారు మాట్లాడుతూప్రజలందరూ సుఖసంతోషాలతో బోనాల పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, అలాగే స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొని భక్తితో అమ్మవారిని దర్శించుకున్నారు.

# బీజేపీ నూతన కమిటీ ప్రకటన



**మంచాల, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ సూచనతో మంచాల మండల బీజేపీ అధ్యక్షుడు నుకం విజయ్ కుమార్ (రాజు) ముదిరాజ్ కొత్త మండల కమిటీని ప్రకటించారు. ఈ కమిటీలో వేదిరే జగదీశ్వర్ రెడ్డి, కారింగు రాజు గౌడ్ ప్రధాన కార్యదర్శులుగా బాధ్యతలు స్వీకరించగా, ఉపాధ్యక్షులుగా యాట రమేష్ ముదిరాజ్, నర్ల కృష్ణ యాదవ్, పోలగోని రాజేశ్వరి, దేవర నాయక్ | నియమితులయ్యారు. కోశాధికారిగా గంట నరసింహారెడ్డి బాధ్యతలు చేపట్టారు.

# ఘనంగా బోయినపల్లి వినోద్ కుమార్ జన్మదిన వేడుకలు

- పూజలు, రక్తదానం, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు

**కరీంనగర్, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్వి ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తలసేమియా బాధితుల కోసం 50 మందికి రక్తదానం కార్యక్రమం నిర్వహించగా, యస్‌సి స్టడీ సర్కిల్, ప్రతిమ స్టడీ సర్కిల్ వద్ద 300 మందికి అన్నదానం చేశారు. వినోద్ కుమార్ కార్యాలయం ఎదుట భారీ కేక్ కట్ చేసి జన్మదినాన్ని ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో వినోద్ కుమార్ కీలక పాత్ర పోషించారని, దేశంలోని 32



పార్టీలను ఒప్పించి కేసీఆర్ గారితో కలిసి ఉద్యమాన్ని ముందుకు నడిపారని గుర్తుచేశారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా ఆయన స్మార్ట్ సిటీగా నగర అభివృద్ధికి 1000 కోట్ల రూపాయలు మంజూరు చేయించారని, జాతీయ రహదారులు, కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ వంటి ప్రాజెక్టులకు సాంక్షన్ తీసుకురాగలిగారని తెలిపారు. పార్లమెంటులో అత్యధిక చర్చల్లో పాల్గొని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన వినోద్ కుమార్, రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థానాల్లో ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో కొంకటి శేఖర్, సుదగోని శ్రీనాథ్ గౌడ్, ధ్యావ మధుసూదన్ రెడ్డి, దూలం సంపత్, రాజు ఆంజనేయులు, చీటీ రాజేందర్ రావు, యూసుఫ్, కర్ర సూర్య, గంటల రేణుక, పావని, రజిని, ఆరెపల్లి సాయికృష్ణ, విజేందర్ రెడ్డి, సముద్రాల ఓంకార్, దీపక్, గొడుగు తిరుపతి, మల్లెంకి శ్రీనివాస్, సత్తినేని శ్రీనివాస్, ఆరె రవి, డాక్టర్ మహేష్, పవన్, రమేష్, చంద్రశేఖర్, శ్రవణ్, అరవింద్, శ్యామ్, చుక్క శ్రీనివాస్ సన్నీ, సంతోష్, వేణు, రాజేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు. రక్తదానం చేసినవారిలో కొంకటి శేఖర్, చంద్రశేఖర్, రమేష్, దీపక్, శ్రవణ్, అరవింద్, శ్యామ్, సన్నీ, సంతోష్, వేణు తదితరులు ఉన్నారు.

# దేవాలయ నిర్మాణానికి బీఆర్ఎస్ నేత విరాళం

## డిండి మండలంలో 30,000 రూపాయల విరాళం అందజేసిన నేనావత్ కిషన్ నాయక్



**డిండి, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
డిండి మండలంలోని టీ. గౌరారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ పెద్దమ్మ తల్లి మరియు లింగమయ్య దేవాలయానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్ నాయక్ రూ.30,000 విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూశ్రీ పెద్దమ్మ తల్లి మరియు లింగమయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధికి దేవాలయాలు ఆధ్యాత్మిక శక్తిని అందించడమే కాక, సమాజంలో ఐక్యతకు దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. విరాళం అందజేసిన వేళ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం గ్రామస్థుల మధ్య సాన్నిహిత్యాన్ని పెంపొందించిందని స్థానికులు పేర్కొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇబ్రహీంపట్నం మండలం తులేకాలన్ గ్రామంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరు రమేష్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా శంకుస్థాపన చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. అభివృద్ధిలో భాగంగా 40 లక్షల సిసి రోడ్లు అండర్ డ్రైనేజ్ అంగన్వాడి కేంద్రం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మల్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని సూచించారు ఆర్థిక ఇబ్బందులు ఉన్న సంక్షేమ పథకాలను ఆపడం లేదని గుర్తు చేశారు. అభివృద్ధిలో భాగంగా కోటి యాభై లక్షలను గ్రామానికి మంజూరు చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శశాంక్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు పాండు,, అంజయ్య, కృష్ణ మహేందర్ జంగయ్య శివ చింటూ రెడ్డి శివ సురవయ్య రాజు శంకర్ పాండు తేజ కిరణ్ విజయ్ రామ్ రెడ్డి వెంకటేష్ శ్రీనివాస్ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మంచాలలో విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ

- జన సందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 వేల రూపాయల విలువైన సేవా కార్యక్రమం





**మంచాల, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మంచాల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర మరియు ఎంపీపీఎస్ పాఠశాలల విద్యార్థులకు జన సందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. నారాయణ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ గోగిరెడ్డి లచ్చి రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాన్నే బాషయ్య, క్యాంపు నిర్వాహకులు ప్రొఫెసర్ ఎస్.కె. బిక్షపతి, సాధురం లైన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి, మండల విద్యాధికారి రాందాస్ పాల్గొన్నారు. మొత్తం 47 మంది విద్యార్థులకు 50 వేల రూపాయల విలువైన కంటి అద్దాలు పంపిణీ చేశారు. క్యాంపు కోఆర్డినేటర్ అశ్వాల బాల్ రాజ్ గారు ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నడిపించారు. ఓరుగంటి శ్రీనివాస్, కడారి లింగ మహేష్, మొగిలి మహేష్, మెరుగు బిక్షపతి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రుబియానా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోగిరెడ్డి లచ్చి రెడ్డి గారు మాట్లాడుతూ"మంచాల మండలంలోని అన్ని పాఠశాలలకు ఈ సేవా కార్యక్రమాన్ని విస్తరించనున్నాం. విద్యార్థులు ఆరోగ్యంగా, విజ్ఞానవంతులుగా ఎదిగి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా మారాలి" అని ఆకాంక్షించారు.

# మైనారిటీ గురుకులంలో సమస్యలపై ఆవేదన



**దేవరకొండ, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేవరకొండలోని మైనారిటీ గురుకులాన్ని బీఆర్ఎస్ నేత రమావత్ రమేష్ నాయక్ సందర్శించారు. డైనింగ్ హాల్, తరగతి గదులు, టాయిలెట్లు పరిశీలించి తల్లిదండ్రులతో మాట్లాడారు. నోట్‌బుక్స్ లేకపోవడం, కలుషిత నీటితో వంటలు, ఆరో ప్లాంట్ పనిచేయకపోవడం వంటి సమస్యలపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాబా, లక్ష్మణ్, లాలయ్య, రాములు, గణేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# నూతన పద్ధతుల ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

- సాంకేతిక పరిజ్ఞానంపై సిబ్బందిపూర్తి అవగాహన పెంచుకోవాలి.
- శిక్షణ ద్వారా సిబ్బంది అన్ని రకాలుగా నిష్ణాతులు కావాలి.
- అనుమానిత వ్యక్తుల సమాచారం నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం.
- పోలీస్‌స్టేషన్ రైటర్స్, సీసీటీఎన్ఎస్ రైటర్లకు, పోలీసు సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ రావుల గిరిధర్



**వనపర్తి,జూలై 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రస్తుత కాలానికి అనుగుణంగా వస్తున్న నూతన పద్ధతులను ఉపయోగిస్తూ పోలీస్‌స్టేషన్ లలో జరుగుతున్నటువంటి నేరాల నియంత్రణకు కేసులలో కొత్తదనం తీసుకువచ్చి కేసుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు పని విభాగాల నిర్వహణలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ లలోని కానిస్టేబుళ్లకు, పోలీస్‌స్టేషన్ రైటర్స్, సీసీ టీఎన్ఎస్ రైటర్లు, టెక్ టీం కానిస్టేబుళ్ళు,కొత్త పోలీసు సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్లో కేసులు పెండింగ్ లేకుండా పనిచేయాలని, ఎప్పటికప్పుడు కేసు వివరాలు సీసీటీఎన్ఎస్ అంతర్జాలంలో నమోదు చేయాలని కేసుల యొక్క పరిశోధనలో నాణ్యతను పెంచి ఎఫ్.ఐ.ఆర్ నుండి చార్జ్ షీట్ రిపోర్టు వరకు ఉండవలసిన మెలకువలు, ఎఫ్.ఐ.ఆర్ , పంచనామా , నేరస్తుల ఒప్పుకోలు పంచనామ స్టేట్మెంట్ రికార్డు చేయు విధానము విషయాలను శిక్షణ ద్వారా క్షుణ్ణంగా నేర్చుకోవాలని నూతన చట్టాలపై అవగాహన కల్పించి జరిగినటువంటి నేరానికి , నేర స్థలానికి జత చేయడం విషయాలను నూతన టెక్నాలజీని వాడుకునే విషయంలో ఏ ఏ పద్ధతులని వాడవలెనో తెలియజేశారు.పాత కేసుల యొక్క విచారణలో ఉన్నటువంటి విషయాలు తెలియపరచి చార్జ్ షీట్ రిపోర్టు కోర్టులలో సమర్పించె వరకు ఫారిన్సిక్ సైన్స్ ను వాడుకునే విధివిధానాలను, కోర్టులో వేసే చార్జ్ షీట్ తయారుచేసి విధివిధానాలను కూడా పోలీసులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణను మూడు రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని తదుపరి స్టేషన్ రైట్స్ సంబంధిత పోలీస్‌స్టేషన్లో వెళ్లిన తర్వాత తమ సిబ్బందికి సంబంధిత అధికారికి శిక్షణ కాలంలో నేర్చుకుంది సవివరంగా వివరించి తెలియజేయాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కేసులలో పరిపక్వతను సాధించాలని, శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి అన్ని రకాలుగా శిక్షణ అందజేసి నిష్ణాతులను చేయడం జరుగుతుందని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిష్ణాతులైన సిబ్బందిచే ప్రత్యేకంగా శిక్షణను అందజేయడం జరుగుతుందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని కేసుల దర్యాప్తును త్వరగా పూర్తి చేయాలని ఎస్పీ అన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధి గ్రామాలలో కాలనీలలో కేసుల ఛేదన సమయంలో సీసీ కెమెరాలు సాక్ష్యంగా ఉపయోగపడతాయని రాత్రింబవళ్లు 24 గంటలు ప్రజలకు రక్షణగా నిలుస్తాయని ప్రతి ఒక్కరూ సిసి కెమెరాల ఏర్పాటు ద్వారా నేర రహిత సమాజ నిర్మాణం సాధ్యమని ఎక్కడైనా ఏ చిన్న సంఘటన జరిగినా సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చని, సీసీ కెమెరాలు మరింత భద్రత కల్పిస్తాయని,సీసీ కెమెరాల ద్వారా ఈమధ్యకాలంలో చాలా కేసులు ఛేదించడం జరిగిందని ఎస్ప తెలిపారు. జిల్లా అంతట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు జిల్లా పోలీసు కార్యాలయానికి అనుసంధానం చేసి పోలీస్ కార్యాలయం నుండి కేసులను ఛేదించడానికి మానిటరింగ్ చేస్తారని ఎస్పీ తెలిపారు .

ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పీ ఉమామహేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ నరేష్, ఏహెచ్ టియు ఎస్సైఅంజద్, ఐటి కోర్ టెక్నికల్ టీం సిబ్బంది గోవింద్, రవీందర్ బాబు, పోలీసు సిబ్బంది, మహిళ సిబ్బంది, తదితరులు ఉన్నారు.


# పర్యావరణ పరిరక్షణ సమితి యొక్క లక్ష్యాలు మరియు మిషన్

**లక్ష్యం**

సుస్థిరమైన, ఆరోగ్యకరమైన జీవనవాతావరణం కోసంపర్యావరణాన్ని రక్షిస్తూ, ప్రజల ఆరోగ్యం, ఆయుష్షు పెంపుకు కృషి చేయడం.

పర్యావరణ పరిరక్షణ సమితి
చెట్టు = అమ్మ
Reg No. 643/2025
Nurture Nature, Promote Wellness

**మిషన్**

- శాస్త్రీయ పద్ధతుల్లో పర్యావరణ పరిరక్షణ
- గాలి, నీరు, నేలపై కాలుష్య నివారణ
- విద్య, సాంకేతికతతో ప్రజల్లో అవగాహన
- యువతకు పది వేల ఉద్యోగ అవకాశాలు
- అభివృద్ధి -పర్యావరణాన్ని సమతుల్యంగా ముందుకు నడిపించడం
- మాదకద్రవ్యాల రహిత భారత దేశ ఆవిష్కరణ
- భారతీయ సాంప్రదాయాల విస్తృత ప్రచారం


# అశోక కాలనీలో ఎమ్మెల్యే నాయిని పర్యటన

-ప్రతి కాలనీని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తాం

– నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)** హనుమకొండ 57వ డివిజన్ అశోక కాలనీలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి కార్యకర్తలను అభినందించారు. అనంతరం అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, నీటి సౌకర్యం, చెత్త సేకరణ వంటి అంశాలపై కాలనీ వాసులతో చర్చించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీలో నిర్మించనున్న ఆలయానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, "అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలకతీతంగా ఓటు వేసిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్నాం" అని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి బాసటగా నిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక సంపత్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు బంక సతీష్ యాదవ్, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నలతో కలిసి నాట్లు వేసిన ఎమ్మెల్యే





**మిర్యాలగూడ, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మిర్యాలగూడ మండలం తకెళ్ళపాడు గ్రామంలో శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) రైతులతో కలిసి ట్రాక్టర్‌తో దమ్ము చేసి, మహిళలతో కలిసి నాట్లు వేశారు. ఈ సందర్భంగా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.రైతులతో కలిసి వ్యవసాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందని, రైతన్నల కష్టాన్ని నిజంగా అర్థం చేసుకోవాలంటే రైతుగా మారాల్సిందేనని ఎమ్మెల్యే బీఎల్ఆర్ పేర్కొన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గాన్ని అన్నపూర్ణగా పిలవడానికి రైతుల పాత్ర కీలకమని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నవడ్లకు 500 బోనస్ వంటి పథకాలతో రైతుల పక్షాన పనిచేస్తున్నదని తెలిపారు. గత ప్రభుత్వాలు పెద్ద భూసాములను మాత్రమే ప్రోత్సహించాయని విమర్శించారు.ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిన్నరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి నేతృత్వంలో రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, బీసీ రిజర్వేషన్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు పేదలకు అందించారని వివరించారు.ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం అవసరమని, ప్రతిపక్షాలు చేస్తున్న అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలని బీఎల్ఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

# నీటి వనరులపై విద్యార్థులకు అవగాహన

- తెలంగాణకు జరుగుతున్న జలదోపిడిపై విద్యార్థుల్లో చైతన్యం
- పొన్నం అనిల్ గౌడ్



**కరీంనగర్, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్** కరీంనగర్‌లోని వివిధ ప్రైవేట్ కళాశాలల్లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నీటి వనరులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొన్నం అనిల్ కుమార్ గౌడ్ నేతృత్వంలో విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేసి, బనకచర్ల ప్రాజెక్టు ద్వారా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు.తెలంగాణ రాష్ట్రం సాధించిన నీళ్లు, నిధులు, నియామకాలు అనే హక్కులను తిరస్కరించే కుట్రలు జరుగుతున్నాయని, విద్యార్థులు వాటిపై పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను నడిపిస్తున్న కుట్రలను తేటతెల్లం చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్, నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్, నాయిని అన్వేష్, బద్దం ప్రవీణ్ రెడ్డి, బోడ ఆంజనేయులు, వడ్లకొండ పరశురాములు, శివ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలపై సమీక్ష

- విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించాలి
- కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**రంగారెడ్డి, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, వన మహోత్సవంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూవసతి గృహాల్లో త్రాగునీటి వసతి, నాణ్యమైన సరుకులు, పౌష్టికాహారం తప్పనిసరిగా ఉండాలని, వారానికి ఒకసారి కిచెన్ శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలి అని సూచించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి, నిర్మాణ పురోగతిని బట్టి నిధులు విడుదల చేయాలి. వన మహోత్సవంలో భాగంగా వంద శాతం మొక్కలు నాటేలా, ముఖ్యంగా ఈత మొక్కలు పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్ఓ సంగీత, హౌసింగ్ పీడీ హనుమంతు నాయక్, డీపీఓ సురేష్ మోహన్, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, వ్యవసాయ అధికారి ఉష, డీఈఓ సుశీంద్రరావు, బీసీ, ఎస్సీ, గిరిజన సంక్షేమ అధికారులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో కలుషిత నీటి సమస్యకు పరిష్కారం

○ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఆధ్వర్యంలో చర్యలు



శేరిలింగంపల్లి, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)
శేరిలింగంపల్లి డివిజన్‌లోని గోపినగర్ ప్రాంతంలో కలుషిత త్రాగునీటి సమస్యపై స్థానికులు ఫిర్యాదు చేయగా, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సంబంధిత అధికారులతో కలిసి పర్యటించి తక్షణ చర్యలు చేపట్టారు. శిథిలమైన మంచినీటి, డ్రైనేజీ పైపులైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన కొత్త పైపులైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నెహ్రూనగర్, ప్రశాంతినగర్ కాలనీల్లో డ్రైనేజీ లీకేజీ సమస్యలపై స్పందించిన కార్పొరేటర్, వర్షాకాలంలో ప్రజలు శుద్ధి చేసిన నీటిని మాత్రమే వినియోగించాలని సూచించారు. డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త వల్ల లీకేజీలు అధికమవుతున్నాయని, దశలవారీగా సమస్య పరిష్కారానికి చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు విస్తరణ పనులలో భాగంగా అడ్డుగా ఉన్న విద్యుత్ స్థంబాలు, అరుగులు, ర్యాంపులను తొలగించాలని అధికారులకు ఆదేశించారు. రోడ్డుకు అవసరమైన వెడల్పు కోసం స్థానికులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎమ్డబ్ల్యూఎస్ అండ్ ఎస్బి డీఈ నరేందర్ రెడ్డి, వాటర్ వర్క్స్ మేనేజర్ అభిషేక్ రెడ్డి, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఏఈ భాస్కర్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, శ్రీకాంత్ దేవులపల్లి, నర్సింహా రెడ్డి, ప్రభాకర్, మహేందర్ సింగ్, రేణు, దస్తగిరి, స్వామి, మహేష్, మల్లేష్, విజయ్, శ్రీశైలం, కుమార్, అశోక్, వంశీ, సాయి, చంటి, మహిళలు స్వర్ణ, కాంత కుమారి, ప్రసన్న, పుష్ప, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో షష్టిపూర్తి మహోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు



కరీంనగర్, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఈ నెల 27న ఆదివారం, కిసాన్ నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం మరియు మహిళా సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఎల్ఎండి కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. కిసాన్ నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం అధ్యక్షుడు దొంతుల మనోహర్ మాట్లాడుతూసంఘ సభ్యులందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వాసవి మాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్న ఈ వేడుకలో, 60 సంవత్సరాలు దాటిన సంఘ సభ్యుల దంపతులకు వేద పండితులచే షష్టిపూర్తి మహోత్సవం, ఆశీర్వచనం నిర్వహించనున్నారు. చిన్నపిల్లలు, మహిళలు, పెద్దల కోసం ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి సిరిపురం తిరుపతి, కోశాధికారి ఉప్పల రాము, మహిళా సంఘం అధ్యక్షురాలు కైలాస నాగశిరోమణి, ప్రధాన కార్యదర్శి పల్లెర్ల మమత, కోశాధికారి ముప్పాల ప్రాతిమ తదితరులు పాల్గొననున్నారు.

## బిర్లా ఓపెన్ మైండ్స్‌లో ఘనంగా బోనాల పండుగ



కరీంనగర్, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):
బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బోనాల పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారిని ఆరాధించే పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో జానపద నృత్యాలు ప్రదర్శించి పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపల్ బబితా విశ్వనాథన్ పాల్గొన్నారు. బోనాల పండుగ విశిష్టతను వివరించిన ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూతెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే ఈ పండుగను విద్యా సంస్థల్లో జరపడం శుభపరిణామమన్నారు. బోనంలో ఉపయోగించే సున్నం, పసుపు, కుంకుమ, వేపాకు వంటి పదార్థాలు ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడతాయని శాస్త్రీయంగా వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి భక్తిశ్రద్ధలతో పాల్గొన్న ఈ వేడుక, సంప్రదాయాలపై అవగాహన పెంచేలా సాగింది.

## సిద్దిపేటలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు

లబ్ధిదారులకు రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సిద్దిపేట, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)
సిద్దిపేట జిల్లా సమీకృత కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ వివేక్ వెంకటస్వామి పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు మరియు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొని మహిళా శక్తిని ప్రశంసించారు.

## సుఖోయ్-57పై ఇండియా దృష్టి పెట్టిందా?

న్యూఢిల్లీ జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)
భారతీయ వైమానిక దళం ఇవాళ కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మిగ్-21 యుద్ధ విమానాలకు సెప్టెంబర్‌లో వీడ్కోలు పలకనున్నట్లు చెప్పింది. అయితే ఈ నేపథ్యంలో రష్యన్ తయారీకి చెందిన అత్యాధునిక ఫిఫ్త్ జరేషన్ యుద్ధ విమానం సుఖోయ్-57(Su-57)పై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ కోణంలో కొన్ని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల బెంగుళూరులో జరిగిన ఎయిర్ షోలో ఆ వార్ ప్లేన్‌ను ప్రదర్శించారు.

## అచ్చంపేటలో మహిళా శక్తి సంబరాలు

○ మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
○ ఎమ్మెల్యే వంశీకృష్ణ



ఉప్పునుంతల, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఉప్పునుంతల మండలంలోని లత్తిపూర్ గ్రామం శ్రీ శ్రీ శ్రీ కట్ట మైసమ్మ దేవాలయం సమీపంలో అరెకటిక మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా శక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ“మహిళలకు సున్నా వడ్డీ రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ కేంద్రాల వంటి పథకాలతో ఆర్థికంగా బలపడేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోంది. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం” అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోనే మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండికారి బాలాజీ, మహిళా సంఘాల అధ్యక్షురాలు, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



వంగూర్, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)
వంగూర్ మండలంలోని కోనాపూర్ గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కానిస్టేబుళ్లకు టెక్నాలజీ శిక్షణ

○ నేరాల ఛేదనకు సాంకేతిక పరిజ్ఞానం కీలకం
○ కమిషనర్ గౌష్ ఆలం



కరీంనగర్-జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు టెక్నాలజీ వినియోగంపై ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కమిషనర్ గౌష్ ఆలం ఆధ్వర్యంలో సీసిటీఎన్ఎస్ 2.0, టీఎస్- కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ- సక్ష్య వంటి అప్లికేషన్లపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానం కీలకమని ఆయన పేర్కొన్నారు.

## “ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి”

వ్యవసాయ విస్తరణ అధికారిని గాయత్రి




ఆమనగల్, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఆమనగల్ రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియ ప్రారంభమైందని వ్యవసాయ విస్తరణ అధికారి గాయత్రి తెలిపారు. ఆమనగల్ క్లస్టర్ పరిధిలోని ప్రతి రైతు తమ ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో రైతు వేదిక వద్ద రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ“భూమి కలిగిన ప్రతి రైతుకు కేంద్ర ప్రభుత్వం 11 అంకెల యూనిక్ ఫార్మర్ ఐడి కేటాయించనుంది. ఇది పీఎం- కిసాన్, పంటల బీమా, కిసాన్ క్రెడిట్ కార్డ్ వంటి పథకాల కోసం తప్పనిసరి. రిజిస్ట్రీ చేయని రైతులకు ఈ ఆర్థిక సంవత్సరం నుంచి పలు పథకాలు అందకుండా ఉండే అవకాశం ఉంది” అని తెలిపారు. ఆమనగల్ లోకల్, మంగల పల్లి, సంకటోనిపల్లి, చింతలపల్లి, మూర్తుజాపల్లి, తండాలు సహా క్లస్టర్ పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.



ఢిల్లీ లో నాగర్ కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవిని మర్యాద పూర్వకంగా కలిసిన ఆమనగల్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాములు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గురం కేశవులు

## కొత్తపల్లిలో బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లోకి చేరిక

○ ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో పార్టీలోకి ఆహ్వానం



అమ్రాబాద్, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)
అమ్రాబాద్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. ప్రజాపాలనలో సమన్యాయం, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాల అమలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ అభివృద్ధి దిశలో తీసుకుంటున్న చర్యలు తమను ఆకర్షించాయని నేతలు తెలిపారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరినవారిలో బాల చంద్రయ్య, రాత్లావత్ రవి, భూమావత్ రమేష్, గంటల రవి ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఎన్ఎస్యూఐ, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ములసాలలో 55 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- పేదల పక్షాన నిలిచే ప్రభుత్వం కాంగ్రెస్‌నే
- ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పెద్దపల్లి మండలంలోని ములసాల గ్రామంలో 55 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి శాసనసభ్యులు డాక్టర్ చింతకుంట విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. గత పాలకులు పేద ప్రజల కష్టాలను పట్టించుకోకుండా, తమ స్వప్రయోజనాలకే పరిమితమయ్యారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నిరుపేదకు మేలు చేసే సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# షాలిని విద్యాసంస్థపై చర్యల కోసం ఏఐఎఫ్బీ నేత బండారి శేఖర్ డిమాండ్



**తిమ్మాపూర్, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తిమ్మాపూర్ మండలంలోని షాలిని విద్యాసంస్థ (జ్యోతిస్మతి ఇంజనీరింగ్ కాలేజీ) ఆధీనంలో ఉన్న సర్వే నంబర్లు 574, 576 పరిధిలోని 15-17 ఎకరాల భూమిపై అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, కమిటీ సభ్యులు ప్రశాంత్, బద్రినేత కలిసి తహసీల్దార్ కర్రే శ్రీనివాస్ రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "మూడుసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. 2007లో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అసైన్డ్ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి, హద్దులు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధం. పివొట్-1977 చట్టానికి విరుద్ధంగా రెగ్యులరైజ్ చేయకుండా, ప్రభుత్వ భూమిగా గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాలి" అని డిమాండ్ చేశారు. ఈ భూమిని దళితులకు, భూమిలేని పేదలకు కేటాయించాలన్నది వారి ప్రధాన అభ్యర్థన. లేకపోతే ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని సూచించారు. తహసీల్దార్ స్పందిస్తూ "పై అధికారుల ఆదేశాలు వచ్చిన వెంటనే అమలు చేస్తాం" అని హామీ ఇచ్చారు.

# సిద్ధిపేటలో కాంగ్రెస్ బలోపేతానికి మంత్రి వివేక్ పిలుపు

ఇతర పార్టీల నేతలు భారీగా కాంగ్రెస్‌లో చేరిక



**సిద్ధిపేట, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి గారి సమక్షంలో ఇతర రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "కాంగ్రెస్ పార్టీ ఆదర్శాలు, నాయకత్వం పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది. కొత్తగా చేరిన నాయకులు సిద్ధిపేట జిల్లాలో పార్టీ బలోపేతానికి కీలకంగా నిలుస్తారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి అన్ని విధాలా మద్దతుగా నిలబడతాం" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ, పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# మానకొండూర్‌లో 50 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన

- ప్రజలకు అందుబాటులో వైద్యం అందించడమే లక్ష్యం
- ఎమ్మెల్యే కవ్వంపల్లి



**ఇల్లంతకుంట, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇల్లంతకుంట మండల కేంద్రంలో 17.50 కోట్లతో నిర్మించనున్న 50 పడకల ఆస్పత్రికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో ఈ ఆస్పత్రి వచ్చే జూలైలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "బీఆర్ఎస్ హయాంలో ఆస్పత్రి కోసం కృషి జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకున్నాం" అని తెలిపారు. అదే రోజు జవహరిపేట -నర్సక్కపేట మధ్య నిర్మించిన వంతెనను ప్రారంభించారు. అలాగే 887 కొత్త రేషన్ కార్డులు, 2593 మంది పేర్ల చేర్పు, వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాలను అమలు చేశారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాజీపేటకు నూతన శోభ తీసుకొస్తున్నాం

ఎమ్మెల్యే నాయిని



**వరంగల్, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట నుంచి సోమిడి వరకు రూ.2 కోట్లతో నిర్మించనున్న సీసీ రహదారి పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో వెనకబడిన కాజీపేటకు నూతన శోభ తీసుకురావడమే లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# మిర్యాలగూడలో ప్రజావాణి కార్యక్రమానికి సిద్ధం

- ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు జూలై 23 బుధవారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు ప్రత్యక్షంగా వినిపించే ఈ కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, విద్యుత్, పంచాయతీరాజ్, విద్యా, సాగు, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారులు అందుబాటులో ఉంటారు. ప్రజావాణి ద్వారా ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేసి, 15 రోజుల్లో పరిష్కారం పొందే అవకాశం కలుగుతుంది. ప్రజల సమస్యలు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరగకుండా, సులభంగా పరిష్కరించుకునే వెసులుబాటు కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని బీఎల్ఆర్ క్యాంప్ కార్యాలయం పేర్కొంది.

# వైశ్య రాజకీయ రుణభేరి గోడ పత్రిక ఆవిష్కరణ



**హైదరాబాద్ జులై 22 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్**
వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో జరిగే వైశ్య రాజకీయ రుణభేరికి మద్దతు పలికిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అలాగే వాల్‌పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో వైశ్య వికాస వేదిక చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్త, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు గణేష్ గుప్త, చింతల రవికుమార్ గుప్త, పసునూరి శ్రీనివాస్ గుప్త, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ గుప్త మరియు వివిధ జిల్లాల అధ్యక్షులు (పీఎస్టీలు) తదితరులున్నారు.

# పద్మశాలి సంఘంలో ఎన్నికైన బీజేపీ నేతలకు ఘన సన్మానం

మోర రవి, కోడం శ్రీనివాస్‌ను శాలువాలతో సత్కరించిన జిల్లా అధ్యక్షుడు



**సిరిసిల్ల, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా బీజేపీ పట్టణ అధికార ప్రతినిధి మోర రవి, సహాయ కార్యదర్శిగా బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డిబోయిన గోపి గారు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, పట్టణ కార్యవర్గ సభ్యులు పాల్గొని అభినందనలు తెలిపారు. పద్మశాలి సంఘంలో బీజేపీ నేతలు ఎన్నిక కావడం పట్ల పార్టీ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# బీజేపీతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యం

-మహాత్మా గాంధీ ఆశయాలకు బీజేపీనే మార్గదర్శి
- రెడ్డబోయిన గోపి



**ముస్తాబాద్, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ముస్తాబాద్‌లో బీజేపీ మండల కార్యశాల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ "గ్రామ స్వరాజ్యం సాధించాలంటే అంకితభావం ఉన్న నాయకత్వం అవసరం. కేంద్ర ప్రభుత్వం గ్రామాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందించాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇల్లంతకుంట మహిళా సమాఖ్యకు జాతీయ గుర్తింపు


- ఆర్థిక స్వావలంబనతో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న మహిళలు
- ఎమ్మెల్యే కవ్వంపల్లి



**మానకొండూర్, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇల్లంతకుంట మహిళా సమాఖ్య దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన, వడ్డీలేని రుణాలు, బీమా చెక్కులు పంపిణీ చేశారు. ఇల్లంతకుంట మండల సమాఖ్యకు జాతీయ 'ఆత్మనిర్భర్ సంఘటన్' అవార్డు లభించడం గర్వకారణమని పేర్కొన్నారు A. ఐకేపీ ద్వారా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలతో వ్యాపార రంగాల్లో రాణిస్తూ ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళల ఆర్థిక బలోపేతమే దేశ ప్రగతికి మార్గమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే సంకల్పంతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు వంటి వ్యాపారాలు మహిళా సంఘాల ద్వారా అమలవుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు

కంటి శస్త్ర చికిత్స అనంతరం ఉచిత కళ్లద్దాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న రోగులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే డాక్టర్ చింతకుంట విజయరమణ రావు ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య సిబ్బందితో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ"ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతన వైద్య సేవలు అందిస్తున్నాం. 50 పడకల ఆసుపత్రిని 100 పడకలకు విస్తరించాం. త్వరలోనే ఏం.ఆర్.ఐ సేవలు ప్రారంభించనున్నాం. కంటి శస్త్ర చికిత్స, డయాలసిస్, చర్మ, ఈ.ఎన్.టి, చిన్న పిల్లల వైద్యం, తిఫ్ఫా స్కానింగ్ వంటి సేవలు ఉచితంగా అందిస్తున్నాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, వైద్యులు, మార్కెట్ చైర్మన్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి సైన్ లాంగ్వేజీ శిక్షణ

అధికారులకు శిక్షణ ప్రారంభించిన కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ కలెక్టరేట్‌లో "బేసిక్ ఇండియన్ సైన్ లాంగ్వేజీ" శిక్షణను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. దివ్యాంగుల భావాలను అర్థం చేసుకొని సమస్యలు పరిష్కరించేందుకు సైన్ లాంగ్వేజీ ఎంతో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు.ఏడు రోజులపాటు జరిగే ఈ శిక్షణను జిల్లా స్థాయి అధికారులకు అందిస్తారు. తదుపరి పాఠశాలలు, భవిత కేంద్రాలు, ఆరోగ్యశాఖ సిబ్బందికి కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్, డీఆర్ఓ, ఆర్డీఓ, శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో 4847 కొత్త రేషన్ కార్డుల పంపిణీ

-ప్రజా ప్రభుత్వంలోనే పథకాల అమలు
-ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి నియోజకవర్గంలోని నందన గార్డెన్స్ లో 4847 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే డాక్టర్ చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ"గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు ఇవ్వని పాపాన పోలలేదు. ప్రజా ప్రభుత్వంలో మాత్రం 35,485 మందికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకున్నాం. కారు, ట్రాక్టర్ ఉన్నారన్న కారణంతో రేషన్ కార్డులు నిరాకరించకూడదు. వారి ఆర్థిక స్థితిని పరిగణనలోకి తీసుకోవాలి" అని అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్రం సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రమని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. కేంద్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్లు, డిఎస్ఓ, తహసీల్దార్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏ నెగటివ్ బ్లడ్ లేక ఆగిన డెలివరీ

-22వ సారి అరుదుగా దొరికే ఏ నెగటివ్ బ్లడ్ డొనేట్ చేసిన కళాకారుడు దప్పు స్వామి
-రక్తదానం -ప్రాణదానం. యువశక్తి ఫౌండేషన్




**వనపర్తి,జులై 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సాటి మనిషి ఆపదలో ఉంది అన్న వెంటనే మానవత్వంతో స్పందించి అరుదుగా దొరికే ఏ నెగిటివ్ రక్తదానం చేశానని ప్రముఖ కళాకారుడు డప్పు స్వామి తెలిపారు. వివరాలోకి వెళితే వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలానికి చెందిన స్వప్న డెలివరీ కోసం గవర్నమెంట్ హాస్పిటల్ అడ్మిట్ అవ్వగా ఆమెకు వెంటనే అరుదుగా దొరికే ఏ నెగటివ్ బ్లడ్ ఎక్కించాలని డాక్టర్స్ నిర్ధారించడంతో ఉమ్మడి పాలమూరు జిల్లా బ్లడ్ బ్యాంకులలో బ్లడ్ దొరకకపోవడంతో మానవత్వంతో స్పందించిన నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండలం మైలారం గ్రామనికి చెందిన ప్రముఖ కళాకారుడు డప్పు స్వామి 22వ సారి ఏ నెగటివ్ రక్త దానం చేసి సాటి మనిషి ప్రాణానికి ఊపిరి పోసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన యువతి యువకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని తెలిపారు.

# కరీంనగర్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శిగా సంతోష్ చారి

-కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం
- నూతన నాయకుడు



**కరీంనగర్, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) కరీంనగర్ జిల్లా కార్యవర్గ సమావేశంలో కసిబోజుల సంతోష్ చారిను జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, బోర్డులో యూనియన్ సభ్యులకు ప్రాధాన్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికకు సహకరించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

# హుజురాబాద్‌లో విద్యార్థులకు మోదీ కానుక



**హుజురాబాద్, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుజురాబాద్ నియోజకవర్గం వీణవంక మండలంలో పదో తరగతి విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని, మోదీ గిఫ్ట్గా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండల విద్యాధికారి శోభారాణి, మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ గౌడ్ విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 20వేల మంది విద్యార్థులకు సైకిళ్లు అందించడమే లక్ష్యమని organizers తెలిపారు .రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల రవాణా సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమని, కేంద్ర మంత్రి బండి సంజయ్ CSR ఫండ్స్ ద్వారా సైకిళ్లు కొనుగోలు చేసి పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయాణ భారం తగ్గించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని అన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్రెడ్డి, నరసింహ రాజు, గొట్టుముక్కల సంపత్ రావు, రాజిరెడ్డి, గొడుగు వినోద్, లింగారెడ్డి, ముత్యాల రవీందర్, భాస్కర్, వెంకటేష్, ఉడుత కుమార్, నాగరాజు, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, యాదగిరి, తల్లిదండ్రులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ దేవాలయానికి ఎంపీ నిధులతో బోర్ ఏర్పాటు

-భక్తుల సౌకర్యం కోసం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సహకారం



**గంగాధర, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గంగాధర మండలం ఘర్షకుర్తి గ్రామంలోని పోచమ్మ దేవాలయం వద్ద భక్తుల అవసరాల కోసం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ నిధుల సహకారంతో బోర్ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పంజలా ప్రశాంత్, కరీంనగర్ సౌత్ జోన్ ఉపాధ్యక్షుడు కొడిత్యాల సురేష్, శక్తి కేంద్రం ఇంచార్జి ఆంజనేయులు దాసరి, బూత్ అధ్యక్షులు, గ్రామ నాయకులు, పోచమ్మ గుడి అధ్యక్షుడు దాది మోహన్, చిందమ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# సెయింట్ జార్జ్ స్కూల్‌లో వన మహోత్సవం

మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించిన కరీంనగర్ పోలీస్ కమిషనర్



**కరీంనగర్, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



కొత్తపల్లి సెయింట్ జార్జ్ స్కూల్‌లో వన మహోత్సవంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, షీ టీం సేవలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.విద్యార్థి దశలో ఒత్తిడికి లోనై మాదకద్రవ్యాల వలలో పడకుండా, స్వీయ నియంత్రణ, సమగ్ర అవగాహన అవసరమని సూచించారు. డ్రగ్ రహిత సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు, అధికారులు కలిసి ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఫాతిమా రెడ్డి, ఇన్స్ట్రక్టర్లు పుల్లయ్య, శ్రీలత, శ్రీనివాస్, నిరంజన్ రెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్‌గా పెట్టెం నవీన్

-కాంగ్రెస్ పార్టీ సేవలకు గుర్తింపు
- రవాణా శాఖలో కీలక పదవి



**కరీంనగర్, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్‌గా కరీంనగర్ జిల్లాకు చెందిన పెట్టెం నవీన్ నియమితులయ్యారు. ట్రాన్స్‌పోర్ట్ భవన్లో రవాణా కమిషనర్ కె. సురేంద్ర మోహన్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాలు స్వీకరించారు.తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియా స్టేట్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తూ, పార్టీ విజయానికి అహర్నిశలు కృషి చేసిన నవీన్ గారికి ఈ పదవి లభించింది. రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలను బలోపేతం చేయడంలో ఆయన పాత్ర కీలకమైంది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# ఆడపడుచులకు అండగా కల్యాణ లక్ష్మి

**యాచారం , జూలై 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**



పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఉన్నదని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. యాచారం మండలం లోని లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కళ్యాణలక్ష్మి , షాది ముభారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ మహిళలు ఈ డబ్బులను వృథా చేయకుండా అవసరానికి వినియోగించుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలపై యూఎస్పీసీ ఉద్యమ కార్యాచరణ

**-విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం**
**- చకినాల అనిల్ కుమార్**




**హైదరాబాద్, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైదరాబాద్‌లోని కర్షక్ బీఈడీ కళాశాల ఆవరణలో జరిగిన యూఎస్పీసీ స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి మూడు దశల ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు చకినాల అనిల్ కుమార్ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 23, 24 తేదీల్లో మండల తహసీల్దార్ల ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రాలు సమర్పించనున్నారు. ఆగస్టు 1న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహించనున్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేయాలని, నూతన జిల్లాలకు డీఈవో, రెవెన్యూ డివిజన్లకు డిప్యూటీ ఈవో, మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, పెన్షనర్ల బిల్లులు విడుదల చేయాలని, పిఎస్హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని కోరారు. పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో జీఓ 2, 3, 9, 10లను రద్దు చేసి జీఓ 11, 12 ప్రకారం పదోన్నతులు కల్పించాలని సూచించారు. పైరవీ డిప్యూటేషన్లను రద్దు చేసి, గురుకుల టైం టేబుల్ సవరించాలని, కేజీబీవీ, మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కామారెడ్డి జిల్లా నుంచి టిపిటిఎఫ్, టీఎస్ యుటిఎఫ్, డిటిఎఫ్ నాయకులు చింతల లింగం, ఆకుల బాబు, దేవుల, శ్యాం కుమార్, సోలేటి నారాయణ, వంశీధర్, రాములు, నీరడి నారాయణ, సంతోష్, గంగారం, విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

# ధన్‌ఖడ్ రాజీనామాపై రాజకీయ చర్చ

**-అనూహ్య రాజీనామాకు కారణాలపై ఆరా**
**-లోతైన కారణాలు ఉంటాయని జైరామ్ రమేశ్ అనుమానం**

**న్యూఢిల్లీ, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఎవరికి తోచిన విధంగా వారు విశ్లేషణలు చేస్తున్నారు. ఇంత సడన్‌గా ఎందుకు రాజీనామా నిర్ణయం తీసుకున్నారని ఆరా తీస్తున్నారు. ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామాపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేసింది. అనారోగ్య కారణాలతో వైదొలుగుతున్నట్లు ఆయన చెప్పినప్పటికీ.. అది కారణం కాకపోవచ్చని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ధన్‌ఖడ్ సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బిజినెస్ అడ్వైజరీ కమిటీకి అధ్యక్షత వహించారు. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రి కిరణ్ రిజిజుతో సహా పలువురు దీనికి హాజరయ్యారు. చర్చ అనంతరం సాయంత్రం 4.30కు మళ్లీ సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. అయితే, మరోసారి భేటీకి రిజిజు, నడ్డా రాలేదు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన ధన్‌ఖడ్ మంగళవారం మధ్యాహ్నానికి వాయిదా వేశారు. దీన్ని బట్టి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4.30 మధ్య ఏదో పెద్ద విషయమే జరిగిందని జైరామ్ రమేశ్ అనుమానం వ్యక్తం చేశారు. రిజిజు, నడ్డా ఉద్దేశపూర్వకంగానే సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈక్రమంలోనే ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ధన్‌ఖడ్ ప్రకటించారు. ఆరోగ్య కారణాల దృష్ట్యా ఇలా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దాన్ని మనం గౌరవించాలి. కానీ, అందుకు చాలా లోతైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోందని రమేశ్ రాసుకొచ్చారు. తన పదవీకాలంలో రైతుల సంక్షేమంపై ధన్‌ఖడ్ నిర్భయంగా మాట్లాడేవారని రమేశ్ పేర్కొన్నారు. ప్రజాజీవితంలో న్యాయపరమైన జవాబుదారీతనం, సంయమనం గురించి గట్టిగా మాట్లాడారన్నారు. ఆయన నిబంధనలు, ప్రొటోకాల్‌కు కట్టుబడి ఉన్నారన్నారు. సోమవారం పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలైన సంగతి తెలిసిందే. తొలి రోజు కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన




ధన్‌ఖడ్ రాత్రి అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలుగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. ఈ క్రమంలోనే ఆయన వైదొలగాలని నిర్ణయించుకోవడం అనుమానాలను కలిగిస్తోంది. ధన్‌ఖడ్ రాజీనామాతో రాజ్యసభ సమావేశాలను ప్రస్తుతానికి డిప్యూటీ- ఛైర్మన్‌గా ఉన్న జేడీయూ నేత హరివంశ్ నడిపించనున్నారు. ఉదయం నుంచి ఎగువసభను సజావుగా నడిపించిన ఆయన రాత్రికి తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ముర్ముకు పంపారు. దీంతో ఆయన రాజీనామాపై ప్రస్తుతం తీవ్రంగా చర్చ నడుస్తోంది. అనారోగ్య కారణాలతో పదవి నుంచి దిగిపోతున్నట్లు- ధన్‌ఖడ్ చెప్పినప్పటికీ.. ఆయన రాజీనామాపై ప్రతిపక్ష పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆరోగ్య కారణాలతోనే పదవి నుంచి దిగిపోతున్నట్లు- చెప్పారని.. దాన్ని మనం గౌరవించాలని జైరాం రమేష్ వ్యాఖ్యానించారు. ఏది ఏమైనా ఆయన రాజీనామా వెనుక ఏదో లోతైన కారణమే ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

# 'ఆ రాత్రి డొనాల్డ్ ట్రంప్‌తో నాకు చేదు అనుభవం

**వెల్లడించిన నటి మారియా ఫార్మర్**

**న్యూఢిల్లీ -జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ఓ రాత్రి తనకు చేదు అనుభవం ఎదురైందని నటి మారియా ఫార్మర్ వెల్లడించారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ కార్యాలయంలో ఒక రోజు రాత్రి ట్రంప్ తనను అదోలా చూశారని ఆమె ఆరోపించారు. ఎప్‌స్టీన్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధపడ్డ సమయంలో ఒక రాత్రి ట్రంప్ తనకు ఆయన ఫోన్ చేశారని మారియా చెప్పారు. అర్జెంటుగా ఆఫీస్‌కు రమ్మనడంతో నైట్ డ్రెస్‌లోనే తాను ఆయన దగ్గరకు వెళ్లానని మారియా చెప్పారు. అప్పటికే ఎప్‌స్టీన్ కార్యాలయంలో ఉన్న ట్రంప్ తన శరీరాన్ని అదోలా చూశారని, తాను షార్ట్స్ ధరించడంతో కాళ్లవైపే చూస్తూ ఉండిపోయారని చెప్పారు. ఈ ఘటన 1995లో జరిగిందని, అప్పుడు తన వయసు 20 ఏళు ఉంటుందని మారియా తెలిపారు. ట్రంప్ తన కాళ్లవైపే చూస్తుండగా అక్కడికి వచ్చిన ఎప్‌స్టీన్ అది చూసి.. 'నోనో.. ఆమె నీకోసం కాదు' అని ట్రంప్‌తో చెప్పారని తెలిపారు. కాగా జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు రేపుతోంది. ఈ కుంభకోణానికి సంబంధించిన ఎప్‌స్టీన్



ఫైల్స్ విడుదల చేయాలని అమెరికావ్యాప్తంగా డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారానికి సంబంధించి మారియా ఫార్మర్ 1996లోనే ఎప్‌స్టీన్, మ్యాక్స్‌వెల్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. వారు సెక్స్ ట్రాఫికింగ్ చేస్తున్నారని మీడియాకు వెల్లడించారు. ఇప్పుడు ఏకంగా డొనాల్డ్ ట్రంప్‌పై ఆరోపణలు చేశారు. మారియా ఆరోపణలపై వైట్‌హౌస్ స్పందిస్తూ.. ఎప్‌స్టీన్‌తో స్నేహాన్ని ట్రంప్ వదిలేసి చాలాకాలం అవుతోందని పేర్కొంది. ట్రంప్ ఏనాడూ ఎప్‌స్టీన్ ఆఫీస్‌కు వెళ్లలేదని వైట్‌హౌస్ కమ్యూనికేషన్ డైరెక్టర్ స్టీవెన్ వెల్లడించారు.

## ఆకుపచ్చని తెలంగాణే లక్ష్యంగా వన మహోత్సవం

**ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**






**యాచారం,జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పచ్చద నాన్ని పెంచి ఆకుపచ్చని తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టిందని ఇబ్రహింపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. యాచారం మండలం గు న్ గల్ వన మహోత్సవ కార్యక్రమంలో ఇబ్రహింపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి మంగళవారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి హాజరై మొక్కలు నాట మాట్లాడారు. వన మహోత్సవం కార్య క్రమం కింద పెద్ద ఎత్తున ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. సరైన సమయంలో వర్షాలు పడాలన్న వాతావరణం సమతుల్యం ఉండాలన్న మొ క్కలు కాపాడాలన్నారు ప్రభుత్వం ఇంటింటికీ మొక్కల పెంపకం కార్యక్రమం చేపడుతుందని మొక్కలు నాటడంతో పాటు కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరి పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అటవీశాఖ అధికారు లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫిల్మ్ నగర్ బస్తీల్లో బోనాల ఉత్సవాలు...


**-పాల్గొన్న ఎమ్మెల్యే దానం...**



**ఫిలింనగర్, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ పరిధిలోని బస్తీలలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి దానం నాగేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫిల్మ్ నగర్ బస్తీలోని దీన్ దయాల్ నగర్, దుర్గ భవాని నగర్, శ్రీ వినాయక నగర్, గౌతమ్ నగర్, చత్రపతి శివాజీ నగర్ తదితర బస్తీలలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. నల్ల పోచమ్మ, ఎల్లమ్మ, ఈదమ్మ, మారెమ్మ దేవాలయాలలోఈ బోనాల ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నరసింగరావు ఆకుల రాజు, కాటూరి రమేష్, ఎండి ఘని, ఎల్లయ్య, కిరణ్, బసవరాజ్, నగేష్ సాగర్ లక్ష్మీనారాయణ, సాయిలు, వేణు పలురు నాయకులు పాల్గొన్నారు.

### ఉమ్మడి వరంగల్ జిల్లా టీఆర్టీఎఫ్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో టిఆర్టిఎఫ్ 8 దశాబ్దాల ఆవిర్భావ విద్యా సదస్సు...

**విద్యా సదస్సు కరపత్రికను ఆవిష్కరించిన హనుమకొండ జిల్లా అడిషనల్ ఎస్పీ...**



**వరంగల్, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భవించి 80 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా టీఆర్టీఎఫ్ జిల్లా శాఖలు మరియు రాష్ట్ర చీఫ్ పాట్రన్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి ఉమ్మడి రాష్ట్రాల కన్వీనర్ దాక్షపు విష్ణుమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం టిఆర్టిఎఫ్ 80 వసంతాలు విద్యా సదస్సును ఏర్పాటు చేసి విద్యా సదస్సు కరపత్రిక ఆవిష్కరణను కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా అడిషనల్ ఎస్పీ (ఇంటెలిజెన్స్) భాస్కర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యా సదస్సు కరపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వడ్డే కిషన్, బాసిరి రాజి బాపురావు, శ్రీనివాస్ నాయక్, మాడిశెట్టి శ్రీనివాస్, తుమ్మనపల్లి రమేష్ బాబు, కూచనపల్లి రవీందర్, పెండెం మధు మరియు రాష్ట్ర కౌన్సిలర్ గుండు సదానందం పాల్గొనడం జరిగింది.